సాక్షి
నల్లగొండ
శనివారం । 13 । జనవరి । 2024



హైవేపై అలర్ట్
సంక్రాంతికి జనం సొంతూళ్లకు వెళ్తున్నారు. హైవేలపై ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. - 10లో



'టీ నేతన్న' యాప్..
ప్రభుత్వ పథకాలను నేరుగా చేనేత కార్మికులకు అందించేందుకు టీ- నేతన్న యాప్ అందుబాటులోకి వచ్చింది. - 12లో



చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ
కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ మత్స్య సహకార సంఘం చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఉత్కంఠగా మారింది. - 12లో

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా యుజవన, క్రీడల అధికారి మక్బుల్ అహ్మద్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ఆసిఫాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ నాయకులు ఉస్మాన్, రామాంజనేయులు, వరమ్మ, వరుణ్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం కోరుతూ కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నందికొండ మున్సిపల్ కౌన్సిలర్లు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ కౌన్సిలర్లు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో అవిశ్వాసంపై ఆర్డీఓ ద్వారా కౌన్సిలర్లకు నోటీసులు అందజేయడంతో వైస్ చైర్మన్ హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారని కౌన్సిలర్లు ఆమెకు వివరించారు. అయితే ఆ స్టేపై ప్రభుత్వమే కోర్టుకు వెళ్లినట్లు కలెక్టర్ తెలిపారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ, రమేశ్‌జీ, మంగ్తానాయక్ తదితరులు ఉన్నారు.

'గ్రంథాలయ' ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణ



గ్రంథాలయ బాధ్యతలు స్వీకరిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్

రామగిరి(నల్లగొండ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి బాధ్యతలను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం స్వీకరించారు. సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, సిబ్బంది ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం నూతన సంవత్సరంలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలను కల్పించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేసినందునే ఓటమి పాలైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందని గుర్తుచేశారు. గద్దపాటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లంమహేష్, ఎండీ.అక్రం, పోలాది కార్తీక్, కర్లపూడి రాము, కిరణ్, గుండాల నరేష్, నాగయ్య శివ పాల్గొన్నారు.

నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ తొలగింపు

నూతనకల్: నూతనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కనకటి వెంకన్నను ఆ పదవి నుంచి తొలగించడంతోపాటు సంఘంలో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కోఆపరేటివ్ సహకార అధికారి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో వేబ్రిడ్జి నిర్మించడం కోసం రూ.5లక్షలు డ్రా చేసి నిర్మించకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో అసలుతోపాటు 18శాతం వడ్డీ చెల్లించాలని పలు దఫాలుగా నోటీసులు జారీ చేశారు. అయినా ఆయన స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నామని శ్రీధర్ తెలిపారు.

● సొంతూళ్లకు పయనం



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద విజయవాడ వైపు బారులు దీరిన వాహనాలు

● కూడారై ఉత్సవం





కూడారై ఉత్సవాల్లో భాగంగా నల్లగొండలోని రామాలయంలో స్వామి వారికి మంగళ హారతి ఇస్తున్న మహిళలు, 108 గంగాళాల్లో నైవేద్యం సమర్పించిన భక్తులు

పట్టభద్రులూ మేల్కోండి!

- నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లు
- ఈ నెల 11వ తేదీ వరకు 32,352 మంది మాత్రమే ఓటరు నమోదు
- పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- ఓటరు నమోదుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు



రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ 2021 ఎన్నికల్లో ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	ఓటర్ల సంఖ్య
యాదాద్రి భువనగిరి	38,367
సూర్యాపేట	61,624
నల్లగొండ	90,826
భద్రాద్రి కొత్తగూడెం	42,679
ఖమ్మం	87,172
జనగామ	21,213
హన్మకొండ	66,379
వరంగల్	33,969
మహబూబాబాద్	36,633
ములుగు	10,323
భూపాలపల్లి	12,796
సిద్దిపేట	3,584
మొత్తం	**5,05,565**

నల్లగొండ : నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటరు నమోదుకు పట్టభద్రుల నుంచి స్పందన తక్కువగా ఉంది. ఈ నియోజకవర్గంలో 2021లో నిర్వహించిన ఎన్నికల సమయంలో మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి జనవరి 1వతేదీ నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 11వ తేదీ వరకు 32,352 మంది మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గత ఎన్నికల్లో నమోదు చేసుకున్నవారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు గడువు ఉందని 01-11-2023 కంటే మూడు సంవత్సరాల ముందు డిగ్రీ ఉత్తీర్ణత చెందిన పట్టభద్రులంతా ఫారం 18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఈనెల 1 నుంచి ఓటరు నమోదు ప్రారంభం

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా షెడ్యూల్‌ను ప్రకటించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ఫిబ్రవరి 24వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. అనంతరం అభ్యంతరాలను స్వీకరిస్తారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ వరకు తిరిగి రెండోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తారు. 2024 ఏప్రిల్ 24న ఓటరు తుది జాబితాను ప్రకటించనున్నారు.

పెరిగిన పట్టభద్రులు..

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 12 కొత్త జిల్లాలు ఉన్నాయి. ఈ పరిధిలో గతంలో మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం పట్టభద్రుల సంఖ్య పెరిగింది. ఆ ప్రకారం అందరూ ఓటు హక్కు నమోదు చేసుకుంటే ఈ సారి ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగే అవకాశం ఉంది.

అందరూ ఓటు నమోదు చేసుకోవాల్సిందే..

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న ప్రతీ పట్టభద్రుడు ఈసారి కూడా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంది. గత ఎన్నికల్లో నిర్వహించిన ఓటరు జాబితా రద్దవుతుందని పట్టభద్రులంతా మళ్లీ నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేక గతంలో నమోదు చేసుకున్నాం కదా.. ఆ లిస్టు ప్రకారమే ఓటు వేయొచ్చనే అభిప్రాయంతో ఉన్నారని తెలుస్తోంది. అందువల్లే ఓటరు నమోదుకు పెద్దగా స్పందన రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పదేపదే పట్టభద్రులు అంతా ఓటు నమోదు చేసుకోవాలని చెబుతున్నా పెద్దగా స్పందించడం లేదు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 01-11-2023 కంటే మూడు సంవత్సరాల ముందు డిగ్రీ ఉత్తీర్ణత చెందినవారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గానికి సంబంధించి ప్రతి ఎన్నికకు నూతన ఓటర్ జాబితా తయారు చేస్తామని ఇంతకు ముందు ఓటు వేసిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో స్వయంగా అందజేయవచ్చని, ceotelangana.nic.in అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

22 వరకు సాధారణ ఓటరు నమోదు

సాధారణ ఓటరు నమోదుకు సంబంధించి 1-1-2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు జనవరి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు శంకర్‌నాయక్, మోహన్‌రెడ్డి, పిచ్చయ్య, యాదగిరి, లింగస్వామి, మహమ్మద్ అహ్మద్ మాలిక్, పి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం చేయాలి

చిట్యాల, హాలియా, దేవరకొండ : ప్రజాపాలనలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే పనులను వేగవంతంగా చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ హైదరాబాద్ (ఆర్‌డీఎంఏ) శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన చిట్యాల, హాలియా, దేవరకొండ మున్సిపాలిటీల్లో చేపట్టిన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి ఉందన్న విషయాలను మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డేటా ఎంట్రీ పూర్తి అయిన దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపర్చాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు మందడి రామదుర్గారెడ్డి, కందిమళ్ల వీరారెడ్డి, చిట్యాల ప్రత్యేకాధికారి ఖాజా అలీ, ఆయా మున్సిపాలిటీలోని సిబ్బంది అబ్దుల్ రషీద్, అపర్ణ, శివాని, ప్రశాంతి తదితరులు ఉన్నారు.



హాలియాలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పారదర్శకంగా నమోదు చేయాలి

కేతేపల్లి : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా, పారదర్శకంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ ఆదేశించారు. కేతేపల్లి లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని శుక్రవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ హరికృష్ణ ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

వేములపల్లి : సాగర్ కాల్వ కట్ట మరమ్మతు పనులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ చేపట్టాలని ఎన్‌ఎస్పీ ఎస్ఈ పీవీఎస్.నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం వేములపల్లి మండలంలోని అన్నపరెడ్డిగూడెం గ్రామ సమీపంలో చేపడుతున్న ఎడమకాల్వ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఆలస్యం వహించినా, నాణ్యతతో లేకున్నా చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కాల్వ కట్ట బలహీనంగా ఉన్న చోట్లను గుర్తించి రూ.14.9 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతోపాటు మరో రూ.21 కోట్లతో 70వ కిలోమీటర్ పరిధిలో ఎడమకాల్వ కట్టను బలోపేతం చేసేందుకు అంచనాలను రూపొందించినట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ గోపీనాథ్, కాంట్రాక్టర్ లక్ష్మారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కాల్వ కట్టను పరిశీలిస్తున్న ఎన్‌ఎస్పీ ఎస్ఈ

రేషన్ దుకాణాలు తెరవాలి

నల్లగొండ : సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రేషన్ దుకాణాలను విధిగా తెరవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్లగొండ పట్టణంలోని 37, 44, 48 నంబర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయానికి రేషన్ దుకాణాలు తెరవని డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలు ఓపెన్ చేసి వినియోగదారులకు ఆటంకం లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ డెలివరీ 99 శాతం పూర్తయిందని.. మిగిలిన ఒక శాతాన్ని వారంలోగా పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు.



రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



దుప్పలపల్లి వద్ద గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

రామగిరి(నల్లగొండ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతిపాదిత కౌంటింగ్ కేంద్రమైన తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న గోదాములను కలెక్టర్ హరిచందన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, సూర్యాపేట జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు నల్లగొండ పార్లమెంట్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. అందుకు అనుగుణంగా స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ రూమ్‌ల ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ రవి, పంచాయతీ రాజ్ ఎస్ఈ తిరుపతయ్య, ఈఈ భూమన్న, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలవైపు ప్రోత్సహించాలి

నల్లగొండ : వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా పండ్లు, కూరగాయల పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ హరిచందన సూచించారు. యాసంగి సీజన్‌లో పంటల సాగు ప్రణాళిక, మత్స్య, ఎక్సైజ్ శాఖ కార్యక్రమాలపై శుక్రవారం ఆమె సమీక్షించారు. సరిపడా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంటలతో పాటు పాడి, సెరికల్చర్ వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. మత్స్య శాఖ ద్వారా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో చేపల మార్కెట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా నిరోధించేందుకు చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఏఓ శ్రవణ్‌కుమార్, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ ఏడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నీలగిరిలో పట్టు కోల్పోయిన బీఆర్ఎస్

- మున్సిపాలిటీలో పూర్తిగా తగ్గిన బలం
- 21 నుంచి ఐదుగురు సభ్యులకు పరిమితం
- కౌన్సిలర్లను కాపాడుకోలేకపోయిన గులాబీ పార్టీ నాయకత్వం
- పూర్వ వైభవాన్ని చాటుకుంటున్న కాంగ్రెస్ పార్టీ

నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నీలగిరి మున్సిపాలిటీ రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నీలగిరి మున్సిపాలిటీని దక్కించుకున్న విషయం తెలిసిందే. 48 మంది సభ్యులు గల మున్సిపాలిటీలో గత ఎన్నికల్లోనే పూర్తి స్థాయి మెజార్టీ రాకపోయినప్పటికీ ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓట్లతో చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. అనంతరం ఓ వార్డు కౌన్సిలర్ (కాంగ్రెస్ సభ్యురాలు) అనారోగ్యంతో మృతి చెందిన కారణంగా వచ్చిన ఉప ఎన్నికతో ఆ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ గెలుపొందింది. మరలా కాంగ్రెస్ కౌన్సిలర్, ఇండిపెండెంట్ కౌన్సిలర్ చేరితో గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి 23 మంది సభ్యులు ఉన్నారు.



15 మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో..

కౌన్సిల్‌లో అతి పెద్ద పార్టీగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ప్రస్తుతం తలకిందులైంది. 48 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో తాజా పరిస్థితి చూసుకుంటే బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా పట్టు కోల్పోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కొందరు, ఎన్నికలు తర్వాత మరికొందరు మొత్తం 15 మంది కౌన్సిలర్లు హస్తం గూటికి చేరారు. దీంతో కారు పార్టీ ఖంగుతిన్నది. ఎన్నికలకు ముందే వలసలను పసిగట్టి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయడంలో గులాబీ నాయకత్వం వైఫల్యం చెందిందనే విమర్శలు సొంత పార్టీ నాయకుల నుంచే వినిపిస్తున్నాయి. పార్టీ ఓడిపోయిన తర్వాత కూడా అధిష్టానం వలసలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదనే చర్చ జరుగుతోంది.

రెండు స్థానాల నుంచి 21కి పెరిగి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరఫున కేవలం ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే గెలిచారు. ఆ తర్వాత 2020లో జరిగిన ఎన్నికల్లో మాత్రం 20 మంది గెలవగా, అనంతరం ఓ వార్డుకు వచ్చిన ఉప ఎన్నికతో బీఆర్ఎస్ సంఖ్య 21కి చేరింది. ఎక్స్ అఫీషియో ఓట్లతో చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న గులాబీ నాయకత్వానికి నాలుగేళ్లలోనే అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఝలక్ ఇచ్చారు. మొదటిసారి చైర్మన్ గిరిని కైవసం చేసుకున్న గులాబీ పార్టీ ఐదేళ్ల పదవి కాలం పూర్తి చేయకుండానే అవిశ్వాస తీర్మానంతో గద్దె దిగాల్సి వచ్చింది. కాగా నీలగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి మధ్యలో కాస్త వెనుకబడినా కాంగ్రెస్ మళ్లీ పూర్వ వైభవాన్ని చాటుకుంటుంది. ఇటీవల వరకు పోటాపోటీగా ఉన్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల బలాబలాలు ఒక్క సారిగా తలకిందులై కాంగ్రెస్ బలం కౌన్సిల్‌లో 36కు చేరింది. ఎక్స్ అఫీషియో మంత్రి ఓటు కలిపితే 37 కానుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో కాంగ్రెస్‌కు 36 బీజేపీ 5, బీఆర్ఎస్‌కు 5, ఉన్నారు. కాగా బీజేపీ నుంచి ఒకరు, ఎంఐఎం నుంచి ఒకరు గత ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరగా ఇటీవల అవిశ్వాస తీర్మానంలో మాత్రం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. వారు బీఆర్ఎస్‌లో ఉంటారా పార్టీ మారతారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

నల్లగొండ రూరల్ : స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ అధ్యాపకులు ప్రేమ్‌సాగర్, రమేష్ అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యూనివర్సిటీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. దేశ కీర్తిని ప్రపంచ నలుమూలల వ్యాపింప చేసిన మహనీయుడు వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, భువన, అనిత, షఫియా, లలిత, కాంతమ్మ, రేణుక, సరిత, అలివేలు, పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

హైవేపై అలర్ట్

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసు శాఖ చర్యలు
- జీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బంది నియామకం
- నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ శాఖ
- జంక్షన్‌ల వద్ద హైవేకు ఇరువైపులా స్టాపర్ల ఏర్పాటు


చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : సంక్రాంతికి పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్తుండడంతో గురువారం సాయంత్రం నుంచే హైదరాబాద్ – విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. ఈమేరకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖలు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధానంగా ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్‌శాలతోపాటు జీఎంఆర్ సంస్థలు ముమ్మరంగా పనిచేస్తున్నాయి. జంక్షన్‌ల వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా జీఎంఆర్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో స్టాపర్‌లను ఏర్పాటు చేశారు.

నాలుగు క్లస్టర్లుగా విభజన

రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం నుంచి చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలోని టోల్‌ప్లాజా వరకు 25కిలోమీటర్ల జాతీయ రహదారిని పోలీసులు నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎస్‌ఐని నియ మించారు. ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేయిస్తూ ట్రాఫిక్ జాం, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించేందుకుగాను వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఏసీపీ మొగిలయ్య, సీఐ దేవేందర్‌లు పర్యవేక్షిస్తున్నారు. హైవేపై బ్లాక్ స్పాట్‌లు, ప్రమాదకర జంక్షన్‌ల వద్ద జీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లోని రోడ్డు అంచులను తాత్కాలికంగా మట్టితో చదును చేయిస్తున్నారు. జాతీయ రహదారి వెంట దెబ్బతిన్న రోడ్డు ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ చేపట్టింది. ప్రమాదాలకు అవకాశం లేకుండా రేడియం స్టిక్కర్లు, జంక్షన్‌ల వద్ద లైట్లు ఏర్పాటు చేశారు.


దండుమల్కాపురం వద్ద హైవేపై రోడ్డు అంచులను చదును చేయిస్తున్న జీఎంఆర్ సిబ్బంది

చెక్‌పాయింట్‌ల వద్ద నిత్యం విధులు


ఎరసానిగూడెం స్టేజీ వద్ద ప్రమాదకరంగా ఉన్న క్రాసింగ్

కట్టంగూర్: కట్టంగూర్ మండల పరిధిలో జాతీయ రహదారి 14 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పామనగుండ్ల, ఎరసానిగూడెం, మాణిక్యాలమ్మగూడెం, కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్‌రోడ్డు, శ్రీకృష్ణనగర్, అయిటిపాముల గ్రామశివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో హైవేపై ఉన్న క్రాసింగ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా జీఎంఆర్ అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన ఎరసానిగూడెం స్టేజీ వద్ద, అయిటిపాముల గ్రామ శివారులో చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో గల క్రాసింగ్‌ల వద్ద ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు చెక్‌పాయింట్‌ను ఏర్పాటు చేశారు. హైవేపై ఉన్న టీ పాయింట్‌లు, హోటల్‌ల వద్ద రోడ్డు పక్కనే వాహనాలు నిలపకుండా ప్రత్యేక టీం ఏర్పాటు చేయటం జరిగింది. చెక్‌పాయింట్‌ల వద్ద 24 గంటలు విధులు నిర్వహించేలా ఆయా ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని ఎస్‌ఐ ఏర్పాటు చేశారు.

హైవేపై పోలీస్ పెట్రోలింగ్


మునగాల వద్ద బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన క్రాసింగ్

మునగాల : సంక్రాంతి పండుగ సందర్భంగా 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీని పరిశీలించేందుకు మునగాల పోలీస్ స్టేషన్ పరిధిలో 48 గంటల పాటు సిబ్బందితో హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపారు. మునగాల స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 22కి.మీ పరిధి ఉందని, ఈ పరిధిలో మాధవరం, మొద్దులచెరువు, తాడువాయి, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల వద్ద క్రాసింగ్‌లు ఉండడంతో బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామన్నారు. ముఖ్యంగా ముకుందాపురం, మునగాల, ఆకుపాముల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తమ స్టేషన్ పరిధిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైవేపై ఉన్న గ్రామాల్లోని ప్రజలు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రమాదకర ప్రాంతాల్లో స్టాపర్లు


చిట్యాల వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు

చిట్యాల: హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు, జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. క్రాసింగ్‌ల వద్ద, ప్రమాదాలు జరిగే చోట స్టాపర్‌లను ఏర్పాటు చేసింది. అనుకోని ప్రమాదాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1033 కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యంతో పాటు, హైవేపై నిలిచిపోయిన వాహనాలను తొలగించేందుకు క్రేన్ సౌకర్యం కల్పించనున్నారు. అదే విధంగా హైవేపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నారు. ట్రాఫిక్ నియంత్రణకుగాను చిట్యాల పోలీసులు ప్రత్యేకంగా ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు జరిగేదిక్కడే..

గుండ్రాంపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద, వెలిమినేడు గ్రామ పరిధిలోని అంజనేయ స్వామి ఆలయం వద్ద, వెలిమినేడు నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో క్రాసింగ్ వద్ద, పెద్ద కాపర్తి శివారులోని గాంధీ గుడి సమీపంలోని క్రాసింగ్ వద్ద, చిట్యాల పట్టణంలోని బస్‌స్టేషన్ ఎదురుగా, పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల క్రాసింగ్ వద్ద, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో, వట్టిమర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద బ్లాక్ స్పాట్‌లుగా(ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా) గుర్తించారు. ఆయా చోట్ల స్టాపర్లను ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. వాహనదారులు గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే అతృతతో వాహనాలు అతివేగంగా నడుపుతుంటారు. దీంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. హైవేపై ప్రమాదాలు జరగకుండా బ్లాక్‌స్పాట్‌లున్న చోట స్టాపర్లను ఏర్పాటు చేశాం. అనుకోని ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– మహేష్, సీఐ, నార్కట్‌పల్లి

సీసీకెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ


దురాజ్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి నుంచి ఖాసీంపేట, వల్లభాపురం, గుంపుల, జి.తిర్మలగిరి, గుంజలూరు వరకు 17 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ముఖ్యంగా దురాజ్‌పల్లి జంక్షన్ వద్ద నుంచి నేరేడుచర్ల, మిర్యాలగూడెం వెళ్లే వాహనాలు జాతీయ రహదారి క్రాసింగ్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేసి రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తంగా చేశారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సీసీ కెమెరాల ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నాం. ప్రత్యేక పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటు చేశాం. హైవే వెంట ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– విష్ణుమూర్తి, ఎస్‌ఐ, చివ్వెంల

పద్మానగర్ జంక్షన్ వద్ద బారికేడ్లు


నకిరేకల్: పద్మానగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

నకిరేకల్: నకిరేకల్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మారిన పద్మానగర్ జంక్షన్ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుకు వాహనాలు భారీగా వెళ్తుండడంతో జీఎమ్మార్ సంస్థ ఆధ్వర్యంలో జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఫాస్టాగ్ కౌంటర్ల ఏర్పాటు


ధర్మోజిగూడెం వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ కౌంటర్

చౌటుప్పల్: టోల్‌ప్లాజాల వద్ద రద్దీ నెలకొంటుంది. ఈ నేపథ్యంలో టోల్‌బూత్‌ల వద్దకు వెళ్లాకే రీచార్జ్ చేసుకునే బదులు.. టోల్‌ప్లాజాకు దూరంగా ఉన్న గ్రామాల వద్ద ప్రైవేట్ వ్యక్తులతో మాట్లాడి ప్రత్యేకంగా ఫాస్టాగ్ కౌంటర్లను అందుబాటులో ఉంచారు. దీంతో వాహనదారులు ఆయా కేంద్రాల వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఆపి ఫాస్టాగ్‌ను పరిశీలించుకుని రీచార్జ్ చేసుకుంటున్నారు.

అదనపు సిబ్బందితో విధులు


జనగామ క్రాస్‌రోడ్డు వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్, ప్రత్యేక సిబ్బంది

సూర్యాపేట: సూర్యాపేట మండలం, చివ్వెంల, సూర్యాపేట పట్టణ పరిధిలో టేకుమట్ల, రాయినిగూడెం, జనగామ క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ, రాజీవ్‌చౌరస్తా, కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు క్రాసింగ్, ఎఫ్‌సీఐ గోడౌన్, దురాజ్‌పల్లి, ఖాసీంపేట, గుంజలూరు వద్ద పోలీసులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఈ ప్రదేశాల్లో కొంతమేర వాహనాల స్పీడ్‌ను తగ్గించేలా స్టాపర్స్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో స్పీడ్ లిమిట్ కోసం బ్లింక్ లైట్స్ అమర్చారు. అదే విధంగా స్థానిక పోలీసు సిబ్బందితో పాటుగా ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందిని కూడా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హైవేపై ఉన్న అన్ని బ్లాక్స్ స్పాట్లలో ట్రాఫిక్ సిబ్బందితో పాటు ముగ్గురు సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

కేతేపల్లిలో నాలుగు యాక్సిడెంట్ స్పాట్లు


కేతేపల్లి : ఇనుపాముల వద్ద ఏర్పాటు చేసిన బ్లింక్ లైట్


కేతేపల్లి: మండలంలో ఇనుపాముల నుంచి ఉప్పలపహాడ్ వరకు 13కి.మీ. మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ మధ్యలో కొర్లపహాడ్, ఇనుపాముల, చీకటిగూడెం, కేతేపల్లి ఎస్సీకాలనీ జంక్షన్లను పోలీసులు యాక్సిడెంట్ స్పాట్‌లుగా గుర్తించారు. వాహనాల రద్దీ పెరుగుతుండడంతో హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. క్రాసింగ్ జంక్షన్‌లు వాహనదారులకు దూరం నుంచే కనిపించే విధంగా రెండు వైపులా బ్లింక్ లైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొర్లపహాడ్‌లోని టోల్‌ప్లాజా నిర్వాహకులు, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లించేందుకు అదనపు కౌంటర్లు కేటాయించారు. 12 కౌంటర్లలో ఏడింటిని విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్నా.. టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు వీలుగా పోలీసు, ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రత్యేక సిబ్బందిని జీఎమ్మార్ సంస్థ నియమించింది.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

హాలియా: హాలియా పట్టణంలో శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా పార్క్ చేసి ఉంచిన నంబర్ ప్లేట్ లేని ఏడు వాహనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

వాహనాల బారులు


హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలోని బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద నెలకొన్న వాహనాల రద్దీ


హైదరాబాద్ - విజయవాడ హైవేపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

హైవేపై కారు దగ్ధం


జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

చిట్యాల: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి కారు దగ్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన నల్లబెల్లి మోహన్‌రావు తన స్నేహితుడు శివతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి గుంటూరుకు వెళుతున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు వెలిమినేడు గ్రామ శివారులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే కారులో అకస్మాత్తుగా మంటలు లేచాయి. గుర్తించిన మోహన్‌రావు, శివ వెంటనే కారు దిగారు. కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. కారులో షార్ట్‌సర్క్యూట్ జరగటంతోనే మంటలు లేచినట్లు తెలుస్తోంది. దీంతో ప్రమాద సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఫైరింజన్ రప్పించి మంటలను ఆర్పించి వేశారు. ఈ ఘటనతో హైవే రోడ్డుపై వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి.. దగ్ధమవుతున్న కారును ఒక వైపునకు తీసుకెళ్లి హైవేపై ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఏసీబీకి చిక్కిన రవాణా అధికారి


ఏసీబీకి చిక్కిన సురేందర్‌రెడ్డి

భువనగిరి క్రైం : భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) శుక్రవారం ఏసీబీకి చిక్కాడు. భూదాన్ పోచంపల్లి మండలం కప్రాయపల్లి గ్రామానికి చెందిన గంగదేవి ప్రవీణ్ ఈ నెల 2న తన లారీ నేషనల్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు డీటీఓ యాస సురేందర్‌రెడ్డి రూ.12,000 డిమాండ్ చేయడంతో ప్రవీణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనతో.. రూ.5 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. శుక్రవారం డీటీఓ సురేందర్ రెడ్డి సూచనలతో ఆయన డ్రైవర్ మల్లికార్జున్‌కు ప్రవీణ్ రూ.5వేలు ఇవ్వబోగా అతను ఆర్టీఏ ఏజెంట్ భుషపాక అనిల్‌కుమార్‌కు ఇవ్వాలని చెప్పాడు. అతను మరో ఏజెంట్ దాసరి సురేష్‌కి ఇవ్వాలని సూచించగా ప్రవీణ్ సురేష్‌కు రూ.5వేలు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీటీఓ సురేందర్‌రెడ్డితో పాటు ఆర్టీఏ ఏజెంట్ అనిల్, సురేష్‌ను ఆధీనంలోకి తీసుకుని వారి దగ్గర రూ.5 వేలతో పాటు మరో రూ.24 వేలను మొత్తం 29,000 నగదు రికవరీ చేసినట్లు ఏసీబీ నల్లగొండ డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు. డ్రైవర్ మల్లికార్జున్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సురేందర్ రెడ్డి అవినీతికి పాల్పడ్డట్టు పూర్తి ఆధారాలు ఉన్నాయని, భువనగిరిలోని రవాణా కార్యాలయంతో పాటు హైదరాబాద్‌లోని సురేందర్ రెడ్డి ఇంట్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా సురేందర్‌రెడ్డి మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కాగా.. జిల్లా రవాణా శాఖ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చెరువులో పడి బాలుడు మృతి

బీబీనగర్: ప్రమాదవశాత్తు బాలుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బీబీనగర్ మండలంలోని గూడూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన కొంతం బస్వారెడ్డి కుమారుడు కొంతం సంతోష్‌రెడ్డి(9) ఉదయం సమయంలో ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారిని అడుగుతూ వెతకసాగారు. సంతోష్ జాడ తెలియరాలేదు. వారి ఇంటి దగ్గరే ఉన్న చెరువు దగ్గరకు వెళ్లి చూడగా.. సంతోష్ ప్రాణాలు కోల్పోయి చెరువులో తేలియాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. బహిర్భూమికి బాలుడు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెంది ఉండొచ్చని స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

బైక్ దొంగ అరెస్టు

- చోరీ చేసిన బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు


పోలీసుల అదుపులో బైక్ దొంగ

హాలియా: బైక్ దొంగను శుక్రవారం హాలియా పోలీసులు అరెస్టు చేశారు. పెద్దవూర మండలంలోని కుంకుడుచెట్టుతండాకు చెందిన రమావత్ రవి తన భార్యతో కలిసి గత కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. రవి అప్పుడప్పుడు తన స్వగ్రామమైన కుంకుడుచెట్టుతండాకు వచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో బైక్ చోరీ చేసి, తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుంటాడు. ఈనెల 10న హైదరాబాద్‌లోని ఓల్డ్ బోయినపల్లిలో నివాసం ఉంటున్న గన్నెరు రాజశేఖర్ బైక్‌పై వ్యక్తిగత పనిమీద హాలియా వచ్చాడు. బస్టాండ్ ఎదుట బైక్‌ను పార్క్ చేసిన రాజశేఖర్ తన పని ముగించుకొని వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో 11వ తేదీన హాలియా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. హాలియా ఏఎస్‌ఐ బావుసింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై నల్లగొండకు వెళ్తున్న రమావత్ రవి అనుమానాస్పదంగా కనిపించడంతో అతనిని పట్టుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. హాలియాలోని బస్టాండ్ వద్ద పార్క్ చేసిన బైక్‌ను తానే చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. కాగా.. రమావత్ రవిపై గతంలో 18 ఆస్తి సంబంధిత కేసులు నమోదై జైలుకు వెళ్లి వచ్చినట్లు తేలింది. కేసును ఛేదించిన ఏఎస్‌ఐ బావుసింగ్, సిబ్బంది శ్రావణ్‌కుమార్, సైదానాయక్, శేఖర్, ముని నాయక్‌ను మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, హాలియా సీఐ గాంధీనాయక్ అభినందించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ


రోదిస్తున్న బాధితురాలు సునీత

మర్రిగూడ: ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసుతోపాటు నల్లపూసల గొట్టాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన చాట సునీత గ్రామం నుంచి మర్రిగూడ మండల కేంద్రంలోని వంట గ్యాస్ కేవైసీ కోసం వెళ్తోంది. అటుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ ఇవ్వమని కోరింది. లిఫ్ట్ ఇచ్చిన అతను యరగండ్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే వాహనంపై ఉన్న ఇరువురు దుండగులు మార్గమధ్యలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి సునీత కళ్లలో మత్తు మందు చల్లి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసుతోపాటు, నల్లపూసల గొట్టాలు అపహరించుకువెళ్లారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

శాలిగౌరారం: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల సతీష్(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత సంవత్సర కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 5న గ్రామసమీపంలోని నల్లచెరువు కట్టవద్ద పూటుగా మద్యం సేవించి మద్యం మత్తులో పురుగుల మందు తాగి కిందపడిపోయాడు. అదే సమయంలో చెరువుకట్ట మీదుగా వచ్చిన గ్రామానికి చెందిన శానాల ఉపేందర్‌రెడ్డి, శెగ్గెం వెంకన్న గమనించి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. అనంతరం సతీష్‌ను ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకువచ్చి వెంటనే 108లో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి మాచర్ల జానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.